RNI Regd No. 06225/99

## సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 1. | సీక్రెట్ డాక్ట్రిన్ ఉపన్యాసాలు - 3 భాగాలు | 750.00 |
| 2. | ఐశ్వర్యము యొక్క మానసికస్థితి | 320.00 |
| 3. | పరివ్రాజకుల కరదీపిక | 180.00 |
| 4. | నవయుగ సాహిత్యము | 180.00 |
| 5. | నవ్యయుగావతరణకు ఏకాదశ పుష్పాలు | 140.00 |
| 6. | సూర్యకిరణ విజ్ఞానము | 110.00 |
| 7. | ఆహార విజ్ఞానము | 110.00 |
| 8. | వేదమయ జీవనము | 90.00 |
| 9. | రహస్య జ్యోతిర్విద్య | 60.00 |
| 10. | గహనా కర్మణో గతిః | 50.00 |
| 11. | ప్రాక్టికల్ థియాసఫీ | 50.00 |
| 12. | అనుగ్రహ మాలామంత్రము | 30.00 |
| 13. | టైమ్ మేనేజ్‌మెంట్ | 25.00 |
| 14. | విశిష్ట యోగసాధనలు - 1 | 25.00 |
| 15. | త్రిముఖీ గాయత్రీమాత ధ్యానవిధానము | 25.00 |
| 16. | శ్రీసూక్తము | 20.00 |

**ప్రతులకు :**

| | | |
|---|---|---|
| ✧ గురు సీతారామ్ | భీమవరం | 90106 47325 |
| ✧ శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె | 90309 80315 |
| ✧ శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం | 98858 74477 |

భూమి స్వర్గముగా మారటానికి
మానవజాతి సాధించవలసిన
5 లక్ష్యాలు

ఒకే శక్తి - సూర్యకిరణాల శక్తి
ఒకే ధర్మము - దేహములే దేవాలయాలు
ఒకే విశ్వము - ఎల్లలు లేని యుద్ధాలు లేని ప్రపంచము
ఒకే భాష - ప్రేమ మౌనము
ఒకే కరెన్సీ - ఒకే వినిమయ సాధనము

# స్వర్ణయుగము

నూతన యుగపు మాసపత్రిక



రూ. 20.00 జూలై 2014 103



## విషయ సూచిక


- మాస్టరుగారి యొక్క లక్ష్యము మానవుడిని దేవమానవుడిగా మార్చడమే 4
- మానవుడు అమరుడిగా మారాలి అంటే, మనస్సుకి కాకుండా, బుద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి 14
- పోల్ షిఫ్ట్ అంశాన్ని ధృవీకరిస్తోన్న ఈనాటి ఆధునిక శాస్త్రవేత్తలు 22



సంపుటి - 9 సంచిక - 7

స్వర్ణయుగము మాసపత్రిక

సంవత్సర చందా : రూ. 240.00

కంట్రిబ్యూషన్ 1000.00



ఫోన్ నెం. : 90106 47325

78421 33860



చందా పంపించవలసిన చిరునామా :

పి. సీతారాముడు

కోమటిగుంట, సీసలి (పోస్టు),

కాళ్ళ మండలం, ప.గో. జిల్లా - 534 237.



ఆంధ్రా బ్యాంక్ ఆన్‌లైన్ ఎకౌంట్ నెం.

00461 00110 20050

IFSC Code : ANDB 0000046



Printed and Published by P. Sita Ramudu and Printed at Akhanda Gurusatta Printers. Komatigunta and Published at Komatigunta, Kalla Mandal, W.G. Dt., A.P.

Editor : P. Sita Ramudu






ఈ దిగువ పరిజనుల సౌజన్యముతో ఈ సంచిక వెలువడినది

| | |
|---|---|
| శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె |
| శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం |
| శ్రీమతి ఏ. శారద | హైదరాబాద్ |
| శ్రీమతి జి. జయప్రద | హైదరాబాద్ |
| శ్రీమతి ఏ. శ్రీలక్ష్మి | హైదరాబాద్ |

పై పరిజనులు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు

గురు సీతారామ్

# మాస్టరుగారి యొక్క లక్ష్యము మానవుడిని దేవమానవుడిగా మార్చడమే



✷ ఏ ఆధ్యాత్మిక సంస్థ యొక్క ఉద్దేశ్యమైనా - పూర్వకాలపు ఋషి పరంపరకు పరాకాష్ఠయైన దధీచి నుండి ఈనాటి శ్రీసత్యసాయి బాబా వరకూ - భూమిపై స్వర్గావతరణే ముఖ్యము.

- కానీ అందరూ ఇతరుల్ని మార్చాలనే ప్రయత్నం చేస్తున్నారు తప్ప, తాను ఏ విధంగాను మారటానికి ప్రయత్నం చేయటం లేదు.

❀ మీరు మారండి - మీ కుటుంబాన్ని మార్చండి - మీ స్నేహితులను మార్చండి - సమాజము మారుతుంది.



❀ మాస్టరుగారు (డా॥ ఎమ్. శ్రీరామకృష్ణగారు) అనంతమైన జ్ఞాన సంపదను అందించడమే కాకుండా,

-- ఆ జ్ఞానసంపదను ఉపయోగించుకోవడానికి వీలుగా,

-- ఆ జ్ఞానసంపదను సమాజానికి అందించడానికి వీలుగా కొన్ని నమూనా ఆశ్రమాలకు, సంస్థలకు బీజారోపణ కూడా చేసి వెళ్ళారు.

మాస్టరుగారు చేసిన అన్ని కార్యక్రమాలకు ఒక లక్ష్యం ఉంది.

***అది ఏమిటంటే,***

దైవీ ప్రణాళిక

డివైన్ ప్లాన్

5000 సంవత్సరాల క్రిందట శ్రీకృష్ణుడు రూపొందించిన ఈ డివైన్ ప్లాన్ యొక్క ఉద్దేశ్యం ఏమిటంటే,

మానవుడిని దేవమానవుడిగా మార్చడం


భూమిని స్వర్గంగా మార్చడం అని మాస్టరుగారు చెప్పేవారు.

మానవుడి యొక్క జీవితం కేవలం కంటికి కనిపించే భౌతిక శరీరానికే పరిమితం అవకుండా, ఈ భౌతిక (స్థూల) శరీరానికి అవల ఉండే ఇంకొక ఆరు శరీరాలకు విస్తరించి ఉంటుంది అని ఆధ్యాత్మిక శాస్త్రాలు చెబుతున్నాయి.

***ఈ మొత్తం ఏడు శరీరాలు ఏమిటంటే,***

స్థూల, కామమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ, అనుపాదుక, ఆది శరీరాలు.

❀ సాధారణ మానవుల జీవితాలు స్థూల, కామమయ, మనోమయ శరీరాలకే పరిమితం అయివుంటాయి.






**సాధారణ మానవుడు దేవమానవుడు (సూపర్‌మేన్) గా పరిణతి చెందాలి అంటే,**

అతని జీవితం యొక్క పరిధి (6 వ పేజీలో చూపించిన విధంగా) బుద్ధిమయ, ఆనందమయ శరీరాలకు కూడా విస్తరించాలి.

మన కంటికి కనిపించే స్థూల శరీరమే కాకుండా,
మనకు వివిధ రకాల కోరికలు (కామమయ శరీరం) ఉంటాయి.
వివిధ రకాల ఆలోచనలు (మనోమయ శరీరం) ఉంటాయి.

**కోరికలకి, ఆలోచనలకి తేడా ఏమిటంటే,**

కోరిక అనేది మన సామర్థ్యం మేరకు కోరుకుంటాం.

ఆలోచనలకు మన సామర్థ్యంతో సంబంధం ఉండదు.
ఎదైనా ఆలోచించేస్తాం అని మాస్టరుగారు చెప్పేవారు.

నేను ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అయిపోతే, ప్రైమ్ మినిస్టర్ అయిపోతే, .... ఇటువంటివి అన్నీ ఆలోచనలు.

ఇల్లు కట్టుకోవాలి, కారు కొనుక్కోవాలి ..... ఇవి, కోరికలు.

❀ ఆలోచన కోరికగా మారితే తప్ప అది భౌతిక రూపం దాల్చదు.
దీనినే మాస్టరుగారు TEA అని చెప్పేవారు.
Thought, Emotion, Action

సాధారణ మానవ జీవితం ఈ మూడింటికే పరిమితం అయివుంటుంది.

❀ కానీ ఎప్పుడైతే మనిషి యొక్క ఆచరణ, కోరికలు, ఆలోచనలు
బుద్ధికి, విజ్ఞతకి అనుగుణ్యంగా మారతాయో (బుద్ధిమయ శరీరం),

-- ఆదర్శాలకు అనుగుణ్యంగా ఉంటాయో (ఆత్మిక శరీరం),

-- అప్పుడు అతను దేవ మానవుడు లేదా సూపర్ మేన్ అవుతాడు.

దేవతలు ఉండే ప్రదేశాన్ని "స్వర్గము" అంటారు.

***అందుచేత భూమి స్వర్గంగా మారాలి అంటే,***

భూమి మీద ఉండే మానవజాతి దేవమానవజాతిగా పరిణతి చెందాలి అని మాస్టరుగారు చెప్పేవారు.

❀ పరిణామక్రమంలో సగం ప్రయాణాన్ని పూర్తిచేసుకుని భూమి మధ్య బిందువుకు చేరుకోవడంతో,
దైవీ ప్రణాళికలో భాగంగా భూమి స్వర్గంగా మారాల్సిన నియతి ఉంది.

శ్రీ అందుచేత భూమిని స్వర్గంగా మలచడానికి,
భూమి మీద ఉండే మానవజాతిని దేవమానవజాతిగా మలచడానికి

-- 5000 సంవత్సరాల క్రిందట శ్రీకృష్ణుడి యొక్క ఆధ్వర్యంలో ఒక దైవీ ప్రణాళిక ఆరంభం అయింది అని మాస్టరుగారు తెలియజేశారు.

***ఈ దైవీ ప్రణాళిక ప్రకారం,***

మానవజాతి యొక్క స్థూల, కామ, మానసిక, బౌద్ధిక, ఆత్మిక శరీరాలు అనుసంధానం చేయబడాలి.

❀ శ్రీకృష్ణావతారం తరవాత వచ్చిన గురు పరంపర మొత్తం ఈ విశేష లక్ష్యం కోసమే కృషి చేశారు.

గత 200 సంవత్సరాల కాలంలో ఈ విశేష లక్ష్యం కోసం కృషి చేసిన గురువులను "అఖండ గురుసత్తా"గా పరిచయం చేసిన మాస్టరుగారు,

ఎవరెవరు ఏ తలంలో పనిచేశారో కూడా 1995 లో సీక్రెట్ డాక్ట్రిన్ మీద ఇచ్చిన ఉపన్యాసాలలో తెలియజేశారు.

ఆ వివరాలను ఈ దిగువన ఒకసారి పరిశీలిద్దాం.






**అఖండ గురుసత్తా**

**(ప్రారంభం .......)**

① సి.వి.వి. - బ్లావెట్స్కీ, ఇది ఒక గ్రూపు.
వీళ్ళు 1st ray or ఆత్మ మీద రీసెర్చ్ చేశారు.
Fohat, ఆత్మ కణాలను కంట్రోల్ చేయటానికి ట్రై చేశారు.

ఆత్మ దగ్గర్నుంచి బుద్ధి, విజ్ఞానమయం. ఈ కోశంలో ఏ తత్త్వం ఉంది?
విజ్ఞానమయకోశం - వాయుతత్త్వం - శ్వాస.

② లాహిరీ మహాశయ, పరమహంస యోగానంద.
వీళ్ళు శ్వాస విధానాన్ని Peak కి తీసుకెళ్ళిపోయారు.

సి.వి.వి. తన పవర్‌ని Comet దగ్గర్నుంచి తీసుకొచ్చాడు.
కామెట్, తోకచుక్క ఉపయోగాలు నెక్స్ట్ వస్తుంది.

③ పైన ఉన్న డిసెంట్ గ్రూప్స్‌కి, క్రిందన ఉన్న ఎసెంట్ గ్రూప్స్‌కి మధ్య అరూపా లెవెల్‌లో లింక్‌గా ఏర్పడిన గ్రూప్ - మదర్ అండ్ అరవిందో.

అంటే దీని అర్థం మిగతా మహానుభావులు ఆ గ్రూప్స్‌లో లేరు అని కాదు. ఫస్ట్ గ్రూప్‌లోనే చూసుకుంటే శంకరాచార్యులవారు, దాని తర్వాత మన జిడ్డు కృష్ణమూర్తి, ఇలాగ సంకల్పశక్తితో పైకి వచ్చిన వాళ్ళు ఎంత మంది ఉన్నారో, ఆ మహానుభావులు అందరూ ఈ ray కే చెందుతారు.

అలాగే ఈ శ్వాస, ప్రాణాయామము, పాతంజలి యోగశాస్త్రము, ఆ యాంగిల్‌లో వచ్చిన మహాపురుషులు అందరూ సెకండ్ గ్రూప్‌కి చెందుతారు.

**వాళ్ళు ఏం చేశారు?**

ఈ Fohat ని, అంటే బుద్ధి తలంలో ఉన్న కణాల్ని మానవ జాతి అందుకోవటానికి వీలుగా తయారుచేశారు.



❀ ఈ రెండిటిని కలిపి అరూపా లెవెల్‌లో ఉన్నటువంటి దాన్ని సరూపా లెవెల్ యొక్క స్థితికి తీసుకొచ్చి అరవిందో వదిలేస్తే,

-- మదర్ - నేను ఫిజికల్ ప్లేన్‌కి కూడా దాన్ని దింపాను అని చెప్పింది. దాన్ని మనం తరవాత డిస్కస్ చేద్దాం.

**ఎందుచేత అంటే,**

దాన్ని ఫిజికల్ ప్లేన్‌కి దింపితే అమృతత్వం వచ్చేయాలి.
మరి అమృతత్వం వచ్చింది, లేదా?

❀ రాలేదు అనుకుంటారు. వచ్చింది.
ఎలా వచ్చిందో నేను ప్రూవ్ చేయాలి కదా, ప్రూవ్ చేశాక చెప్తాను నేను.

**ఎలా ప్రూవ్ చేయాలి అంటే,**

మొన్న పూర్ణచంద్రరావుగార్ని ఒకాయన ఒక క్వశ్చన్ వేశారు, అలాగే పూర్తి చేస్తాన్నేను. ఆ క్వశ్చన్‌కి ఆన్సర్ చెప్పేస్తే మీరే ప్రూవ్ చేసుకోగలుతారు.

**క్వశ్చన్ ఏం అడిగారు అంటే,**

☹ కర్మసన్యాసాన్ని చెప్పిన శంకరాచార్యుల వారేమో ప్రపంచమంతా తిరిగారు.
కర్మ చేయమని చెప్పిన అరవిందో అసలు తిరగలేదు.

అదే జవాబు అమృతత్వానికి కూడా.
దీనికి నేను తరవాత చెప్తాను. ఇవన్నీ డిసెంట్ గ్రూప్స్.

④ ఎసెంట్ గ్రూప్స్‌లో సరూపా మనస్సు తలానికి చెందిన గ్రూప్
శ్రీరామశర్మ ఆచార్య, మాతా భగవతీదేవిశర్మ - అగ్ని తత్త్వము

⑤ ప్రాణమయకోశము - జల తత్త్వము - భక్తి పంథా
రామకృష్ణ పరమహంస - శారదామాత.

⑥ స్థూల జగత్తు - శిరిడీ సాయి, సత్యసాయి.

ఈ శిరిడీ సాయి, సత్యసాయి అనే మాటలో నేను మొత్తం అవధూతా కాన్సెప్ట్ చెప్తున్నాను.

దత్తాత్రేయ అవతారాలు, దత్తాత్రేయ అంశావతారాలు అన్నీ ఈ గ్రూప్.

❀ This is the grand concept, Theosophy gives.

-- ఏ గురువునీ వదిలిపెట్టదు,
ఏ గురువు యొక్క రోలూ తక్కువ అనదు.

మీ స్వభావాన్ని బట్టి ఎవర్ని ఎన్నుకుంటారు?

ఒక్కొక్క రోజు ఒక్కొక్క స్వభావం ఉండొచ్చు మీకు.

ఆ స్వభావాన్ని బట్టి మీరు ఎన్నుకోండికాని, మనకి కావలసిన రిజల్ట్ ఏమిటంటే, వంట బాగా జరగాలి. Cooking must be good.

అందుచేత ముందు బియ్యం కడుగుతారా, వంకాయలు తరుగుతారా, పోపు ప్రక్కన పెట్టుకుంటారా, నూనె ప్రక్కన పెట్టుకుంటారా? మీ ఇష్టం, వంటకి కావలసినవి సేకరించుకోండి.

అలాగే, Collect the materials, read all of them.

*(........ ముగింపు)*

"అఖండ గురుసత్తా" లోని పై గురువులు అందరూ భౌతిక జగత్తులో చేసిన కార్యక్రమాలు కొద్దో గొప్పో మనకు తెలుసు.

సాధారణంగా వారి యొక్క భౌతికమైన కార్యక్రమాలను మాత్రమే మనం పట్టించుకుంటాం. కానీ ఆ భౌతిక కార్యక్రమాల ఉద్దేశ్యం మాత్రం భౌతిక జగత్తుకు సంబంధించింది కాదు అనేది పై వివరణ బట్టి మనకు అర్థమవుతోందికదా!



ఒక్క దత్తా కల్ట్‌కి సంబంధించిన గురువులు తప్ప, మిగతా గురువులు చేపట్టిన కార్యక్రమాలు అన్నీ వేరే జగత్తులకు సంబంధించినవి.

**మరి మాస్టరుగారు చేపట్టిన కార్యక్రమాలు ఏ జగత్తుకు సంబంధించినవి?**

మాస్టరుగారు అఖండ గురుసత్తాకు రూపకల్పన చేశారు కాబట్టి,

ఆయన చేసిన కార్యక్రమాలు పై ఆరు రకాల కార్యక్రమాలను సమన్వయం చేసేవి అయివుంటాయి.

**కానీ ఏ గురువు ఏ తలానికి సంబంధించిన కార్యక్రమం చేసినా, అందరి గురువుల లక్ష్యం ఏమిటంటే,**

దేవ మానవజాతిని ఆవిర్భవింప చేయటం.
భూమిపై స్వర్గాన్ని అవతరింప చేయడం.

అందుచేత మాస్టరుగారి అనుయాయులుగా,
మాస్టరుగారి అభిమానులుగా ఈ లక్ష్యాన్ని మనం మర్చిపోకూడదు.

మనము, మన కుటుంబము,
మన సమాజము దేవమానవులుగా మారాలి.

**దేవ మానవులుగా మారాలి అంటే,**


మన యొక్క ఆచరణ, కోరికలు, ఆలోచనలు
విజ్ఞతతో (బుద్ధితో) కూడికొని ఉండాలి. ఆదర్శాలతో నిండివుండాలి.

ఇందుకు అవసరమైన శిక్షణను మనం మాస్టరుగారు అందజేసిన జ్ఞానం ఆధారంగా, ఆయన స్థాపించిన ఆశ్రమాలు, సంస్థలు ఆధారంగా పొందాలి.

అదే ఆయనకు మనం అర్పించగలిగే నిజమైన శ్రద్ధాంజలి.

❀✻❀

# మానవుడు అమరుడిగా మారాలి అంటే, మనస్సుకి కాకుండా, బుద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి



- ఒకటి మాత్రం గుర్తుంచుకోండి,
  పృథ్విని పవిత్రముగా మార్చే ఈ కార్యక్రమము బాధ్యతా రహిత, విచక్షణా రహిత, నరనరాలలో స్వార్థాన్ని జీర్ణించుకొన్న మానవ జాతి సహకారముతో జరుగుతుందని ఋషులు ఎంత మాత్రము అనుకొనుట లేదు.

-- కానీ వారి విశాల ప్రేమ, పృథ్వి మీద ఉన్న ప్రతి చేతనా ఘటము ఈ అద్భుత ఉత్సవములో పాల్గొనాలని కోరుకుంటుంది.

- మనము పాలు పంచుకున్నా, పంచుకొనక పోయినా
  నియతి తన మార్గాన్ని తనే నిర్ణయించుకుంటుంది.

మరి మీరో ? ? ?



3.5.2010 న హైదరాబాద్‌లోని బి.డి.ఆర్. టవర్స్‌లో నా కుటుంబంతో కలిసి మాస్టరుగారిని కలిశాను.

ఆ రోజు మొత్తం ఆయనతో గడిపే అవకాశం అప్పుడు మాకు చిక్కింది.

పాపం విజయా విశ్వనాథ్‌గారు (మాస్టరుగారి మరదలు) మమ్మల్ని మూడు రోజుల పాటు ఉండమని అడిగారుకాని, ఆ మర్నాడే మేము ఆవిడకి చెప్పకుండా పారిపోయి వచ్చాము.

మానవుల యొక్క మాటలు ఇంత విచిత్రంగా ఉంటాయి.

ఒక వైపు ఆ రోజు మొత్తం ఆయనతో గడిపే అవకాశం చిక్కింది అంటున్నాను. ఇంకొక వైపు పారిపోయి వచ్చాము అంటున్నాను.

***ఎందుకు పారిపోయి రావాల్సి వచ్చింది అంటే,***

మేము ఒక సమస్యకు నివారణ కోసం ఆయన్ని కలిశాము.

దానికి ఆయన ఇచ్చిన పరిష్కారం ఎలా ఉంది అంటే,
తలపోటుగా ఉంది అంటే, తల తీసేయ్ అన్నట్టుగా అన్పించింది.

* అందుకే మాస్టరుగారు నిజమైన గురువు "మన మనస్సే" అని చెబుతారు.

మన మనస్సు ఒప్పుకుంటే-ఆ పని చేస్తాం.
మనస్సు ఒప్పుకోకపోతే గురువు చెప్పినా ఆ పని మనం చేయలేం.

అందుకే మాస్టరుగారు "బుద్ధిని ఉపయోగించి పని చేస్తాను!" అని చెప్పేవారు.

శ్రీ బుద్ధిని ఉపయోగించాలి. మనస్సుని కాదు.

* ఆ బుద్ధిని ఉపయోగించి పని చేసినప్పుడే దేవ మానవులం కాగలం.

మాస్టరుగారి సూచన మేరకు 31.3.99 న మా ఫ్యామిలీ భీమవరం నుండి గుంటూరుకి షిఫ్ట్ అయ్యాము. 2000 మార్చి నెలలో తిరిగి భీమవరానికి వెళ్ళిపోదామని నిర్ణయించుకుని, ఆ విషయాన్ని మాస్టరుగారితో చెప్పాను.

ఆయన అలాగే అన్నారు.

కానీ తరవాత రెండు రోజులకే హైదరాబాద్ నుండి శేషుప్రసాద్‌గారు గుంటూరు వచ్చారు. అప్పట్లో హైకోర్టు అడ్వకేట్ ఇంద్రసేనారెడ్డిగారి దగ్గర మాస్టరు గారి సోదరుడు విశ్వనాథ్‌గారు, శేషు ప్రసాద్ అసిస్టెంట్స్‌గా పనిచేసేవారు.

శేషు ప్రసాద్‌గారు ఉండగా మాస్టరుగారు నన్ను పిలిచి, "గురువు ఎక్కడ పెడితే అక్కడ ఉండాలి. నువ్వు హైదరాబాద్ షిఫ్ట్ అవ్వు!" అన్నారు.

నేను కొంచెం ఆశ్చర్యపోయాను.

*ఎందుకంటే,*

మాస్టరుగారు కేవలం సూచనలు చేసే వారు తప్ప, గురువుగా తన అనుయాయిలను శాసించే సంఘటనలు చాలా అరుదు. ముఖ్యంగా నా విషయంలో అంతకు ముందు ఎప్పుడూ ఆ విధంగా జరగలేదు కూడా.

*మాస్టరుగారు ఆ విధంగా శాసించడానికి కారణం ఏమిటంటే,*

నేను హైదరాబాద్ షిఫ్ట్ అవ్వడానికి నా మనస్సు ఏ మాత్రమూ అంగీకరించదు అని ఆయనకు తెలుసు.

1994 మే నెలలో మాస్టరుగారు పరిచయం అయిన తరువాత, మాస్టరు గారి పరివార్ సభ్యులను నా పరివార్ సభ్యులుగానే భావించేవాడిని. పరివార్ సభ్యులు అందరిలో ఈ కుటుంబ భావన అప్పట్లో చాలా ఎక్కువగా ఉండేది.

మాస్టరుగారి ఆర్గనైజేషన్ నా ప్రాణము అనుకునే వాడిని.



మనుష్యులు అందరూ చాలా మంచిగా కనిపించేవారు.

2000 నాటికి గ్యారంటీగా స్వర్ణయుగము వచ్చేస్తుంది అనుకునేవాడిని.

1999 లో గుంటూరు వెళ్ళిన తరువాత ప్రపంచం యొక్క నిజ స్వరూపాన్ని మాస్టరుగారు చూపించడం మొదలుపెట్టారు.

ఆధ్యాత్మిక సంస్థలు కంటే,
స్వార్థంతో కూడిన రాజకీయ సంస్థలే చాలా బెటర్ అనిపించేది.

స్వార్థము, పదవులు, కీర్తి కాంక్ష విషయంలో ఆధ్యాత్మిక సంస్థలలోని నాయకులకి, రాజకీయ నాయకులకి ఏ మాత్రమూ తేడా లేదు అనిపించేది.

ఎక్కడ ఉన్నా, ఉండేది ఆ మనుష్యులే కదా!

అప్పటికే నా మనస్సు మనుష్యులతో చాలా విసిగిపోయి ఉండడంతో, హైదరాబాద్ వెళ్ళటానికి అది ఏ మాత్రమూ అంగీకరించదు.

కానీ హైదరాబాద్‌లో నేర్చాల్సిన పాఠాలు నేర్చకుండా గురువు ఊరుకోడుగా! అందుకే శాసించి మరీ మాస్టరుగారు మమ్మల్ని హైదరాబాద్ పంపించారు.

*అప్పుడు ఆయన ఇంకొక మాట కూడా అన్నారు,*

"గురువు ఎప్పుడూ నీకు నచ్చని పరిస్థితులే ఇస్తాడయ్యా!
ఎందుకంటే, నీ మనస్సుని చావగొట్టడానికి!"

* జీవితంలో ఎప్పుడు ఎప్పుడు మనకు నచ్చని పరిస్థితులు ఏర్పడినా ఈ విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి.
-- మన మేలు కోసం గురువు ఇచ్చిన పరిస్థితులుగానే వాటిని స్వీకరించాలి.

మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః
బంధానికి అయినా, మోక్షానికి అయినా మనస్సే కారణం.

మన చేతనత్వం నాలుగు రకాలుగా ప్రవర్తిస్తూ ఉంటుంది. అవి,
మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము.

మనస్సు అనేది ఇష్టాయిష్టాలతో కూడుకొని ఉంటుంది.
బుద్ధి అనేది నిశ్చయాత్మకంగా ఉంటుంది.

* మనం "చేయదలచిన పనులు" అన్నీ మనస్సుని ఉపయోగించి చేస్తాం.
మనం "చేయవలసిన పనులు" అన్నీ బుద్ధిని ఉపయోగించి చేస్తాం.

***మనస్సుని ఉపయోగించి పనులు చేస్తే వచ్చే పెద్ద ఇబ్బంది ఏమిటంటే,***

ఏ చిన్న కష్టం వచ్చినా ఆ పనిని వదిలేస్తాం.

అంతే కాకుండా ఆ పనులు అన్నీ మన ఇష్టాయిష్టాలకు సంబంధించినవి కాబట్టి, చాలా వరకు ఆ పనుల వల్ల ఎటువంటి ప్రయోజనమూ ఉండదు.

కేవలం అవి మనోరంజకంగా ఉంటాయి అంతే.

కానీ చేయవలసిన పనుల్ని మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా వాటిని పూర్తి చేస్తాం. దాని వల్ల సహజంగానే మనం తరవాత మెట్టుకి ఎక్కగలుగుతాం.

అందుచేత చేయదలచిన పనులు కంటే,
చేయవలసిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి అని మాస్టరుగారు చెప్పేవారు.

* మనస్సు కంటే, బుద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి.
మనస్సు బుద్ధి చెప్పిన దారిలో నడవాలి.

మన జీవిత విధానంలో ఈ బుద్ధికి ప్రాముఖ్యత ఇచ్చినప్పుడు,
ఈ విచక్షణా జ్ఞానానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడు,
మనం మనస్సు యొక్క బంధనాల నుండి బయటపడి,
దేవమానవులుగా పరిణతి చెందుతాం.



2010 మే నెలలో మాస్టరుగారిని హైదరాబాద్‌లో కలిసినప్పుడు, ఆయన బ్రెయిన్‌కి సంబంధించిన సమస్యతో అనారోగ్యంగా ఉన్నారు.

ఆయన అలాగ అనారోగ్యంగా ఉండటాన్ని చూడలేక,
"మాస్టారూ! రోగరహిత జీవితం,
వృద్ధాప్య రహిత జీవితం,
అమరత్వం అందరూ సాధించవచ్చు అని చెబుతున్నాం కదా!

"అమరత్వం, వృద్ధాప్యరహిత జీవితాలను ప్రక్కన పెట్టేదాం. కనీసం రోగరహిత జీవితాన్ని అయినా మనం జీవించాలి కదా! ఈ అనారోగ్యాన్ని తగ్గించుకోండి మాస్టారు!" అన్నారు.

ఆయన దానికి సమాధానాన్ని దాటవేశారు.
"ఉష్! అని దానిని తగ్గించుకోండి మాస్టారు!" అని నేను ఒత్తిడి చేశాను.
"అది నాకు రాదయ్యా!" అంటూ,

* "18 సంవత్సరాల వయస్సులో ఎంత ఆరోగ్యంగా ఉంటామో,
అదే ఆరోగ్యంతో ఎంత కాలం కావాలంటే, అంత కాలం జీవించే విధానాన్ని ఇటు గురువుగారు (పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య) ఇచ్చారు. అటు అరవిందో కూడా ఇచ్చారు.

-- కానీ దానికి మన జీవిత విధానం, ఆహారపు అలవాట్లు మారాలి.

-- కానీ ఆ స్థితికి వెళ్ళిన వాళ్ళకి ఈ శరీరం మీద వ్యామోహం ఉండదయ్యా!" అన్నారు.

పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య అమరత్వాన్ని సిద్ధింపజేసే సాధనా విధానంగా, మనల్ని దేవమానవులుగా మలిచే సాధనంగా గాయత్రీ మంత్ర సాధనను ప్రచారం చేశారు.

15.10.94 న మాస్టరుగారిని అమలాపురంలో కలిసినప్పుడు, గాయత్రీ మంత్ర ప్రచారం గురించి మాట్లాడుతూ,

* "కేవలం గాయత్రీ మంత్రాన్ని ప్రచారం చేయడం వలన ఏ మార్పూ రాదు! ఇప్పటి వరకూ రామా, రామా అనేవాళ్ళు ఓం భూర్భువః స్వః ...... అంటారు అంతే.

-- జపం ముఖ్యం కాదు. మన జీవిత విధానం మారాలి" అన్నారు.

గాయత్రీ మంత్ర సాధన వలన మనలో బుద్ధి ప్రచోదన జరుగుతుంది.

అందుచేత మన జీవితంలో ఇష్టాయిష్టాలు కంటే, విచక్షణా జ్ఞానానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడే గాయత్రీ మంత్రం మనకు అమరత్వ సాధనం అవుతుంది.

***అమరత్వ సిద్ధికి మాస్టరుగారు ఇచ్చిన అత్యద్భుతమైన సాధన ఏమిటంటే,***

సమర్థ సద్గురు స్పర్శ ధ్యానము

21 ఓంకారాలతో చేయబడే సమర్థ సద్గురు స్పర్శ ధ్యానం వలన మన యొక్క ఏడు శరీరాలు సమన్వయం చేయబడతాయి.

ఈ ధ్యానవిధానంలో చివరి (21 వ) ఓంకారము శిరస్సులోని బుద్ధి స్థానంలో ఉచ్చరింపబడి, మన ధ్యానము ఆ బిందువు వద్ద చేయబడుతుంది.


అందుచేత మానవుడు దేవమానవుడిగా పరిణతి చెందడంలో ఈ బుద్ధితలం చాలా కీలకమైన పాత్ర పోషిస్తుంది.

మన జీవిత విధానంలో ఈ బుద్ధికి, ఈ విచక్షణా జ్ఞానానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి జీవిస్తూ, అమరత్వ సాధన దిశగా ప్రయాణించగలిగితే,

అదే మనం మాస్టరుగారికి అర్పించగలిగే నిజమైన శ్రద్ధాంజలి.

***





# పోల్ షిఫ్ట్ అంశాన్ని ధృవీకరిస్తోన్న ఈనాటి ఆధునిక శాస్త్రవేత్తలు



❋ ఋషులు ఉన్నారా లేదా?
ఇతర గ్రహవాసులు నిజంగా ఉంటే మన మీద వాళ్ళకి ఉన్న ఆపేక్షకు గల కారణమేమిటి? అనే ప్రశ్నలకు నా దగ్గర జవాబు లేదు.

-- ఇది కేవలము వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన విషయము.

❋ మీరు విశ్వసించినా, విశ్వసించకపోయినా మనము చర్చించుకుంటున్న సాధనా విషయాలు శాస్త్రప్రమాణానికి, పెద్దలు చెప్పిన విభిన్న మార్గాలకు సరిపోతున్నాయో, లేదో చూసుకోండి.

-- మన శిబిరాలలో చర్చించుకున్న విషయాలు మీకు, మీ కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడతాయని విశ్వసించగలిగితే,
ఈ విచిత్ర క్రాంతికి మీరు అందరూ సహకరిస్తారని ఆశిస్తున్నాను.



మాస్టరుగారు చెప్పిన అనేక రహస్య విషయాలను, భవిష్యవాణులను నమ్మగలిగే స్థితిలో ఈనాటి జనసామాన్యం లేదు.

ఏదో 24 కోట్ల సంవత్సరాల తరవాత వచ్చిన అవకాశం అంటున్నాం,
5000 సంవత్సరాల క్రిందట ప్రారంభమైన దైవీ ప్రణాళిక అంటున్నాం,
సత్యయుగపు పునరాగమనం అంటున్నాం,
భూమిపై స్వర్గావతరణ అంటున్నాం,
వీటన్నిటిని విశ్వసించే స్థితిలో ఈనాటి సమాజం లేదు.

***ఇంకా కరెక్ట్‌గా చెప్పాలి అంటే,***

ఇటు వంటి విషయాల మీద 2000 సంవత్సరం నాటికి ఉన్న అసక్తి కూడా ఈనాటి ప్రజలకు లేదు.

అందులోనూ మాస్టరుగారు చెప్పిన అనేక భవిష్యవాణులు సూక్ష్మజగత్తుకే పరిమితం అయి, భౌతిక జగత్తులో వాటి యొక్క సూచనలు కనిపిస్తున్నాయి తప్ప, వాటి యొక్క ఉనికి మనకు స్పష్టంగా ఎక్కడా కనిపించడం లేదు.

చెప్పిన భవిష్యవాణులు సకాలంలో సాకారం అవ్వకపోతే, ఈ విషయాల యొక్క విశ్వసనీయత సహజంగానే ప్రశ్నార్థకం అవుతుందికదా!

ఇదే పరిస్థితిని 1980 లో పబ్లిష్ అయిన "పోల్ షిఫ్ట్" అనే పుస్తకం యొక్క ఎడిటర్, జాన్ వైట్ కూడా ఎదుర్కొన్నాడు.

ఆ పుస్తకంలో 2000 సంవత్సరం నాటికి భూమి యొక్క ఉత్తర, దక్షిణ ధృవాల యొక్క స్థానం మారుతుంది అని ప్రముఖంగా పేర్కొంటూ,

వివిధ వ్యక్తుల అభిప్రాయం ప్రకారం ఆ పోల్ షిఫ్ట్ ఏ విధంగా జరుగుతుంది అనే విశ్లేషణలను ఆ పుస్తకంలో తెలియజేశారు.


కానీ 2000 సంవత్సరం నాటికి ఎటువంటి పోల్ షిఫ్టూ జరగకపోవడంతో సహజంగానే ఆ ఎడిటర్ రకరకాల విమర్శలను ఎదుర్కోవలసి వచ్చింది.

*ఈ విషయం గురించి మాస్టరుగారు ప్రస్తావిస్తూ,*

"ఆ పబ్లిషర్ అనవసరంగా కంగారు పడ్డాడుకాని, కొన్ని వేల సంవత్సరాల కాల వ్యవధిలో జరిగే ఆ పోల్‌షిఫ్ట్, కరెక్ట్‌గా అదే టైమ్‌కి కాకుండా కొన్ని సంవత్సరాలు అటూ ఇటూగా జరగవచ్చు" అన్నారు.

మాస్టరుగారు ఈ విధంగా పోల్ షిఫ్ట్ సంభావనను సమర్థించడంతో, స్వర్ణయుగము మాసపత్రికలో పోల్ షిఫ్ట్‌కి సంబంధించిన కొన్ని విశ్లేషణలను తెలియజేయడం జరిగింది.

ఆ పోల్ షిఫ్ట్ ఏ విధంగా జరుగుతుంది అనే దాంట్లో రకరకాల అభిప్రాయాలు ఉన్నప్పటికీ, హ్యూగ్ ఆచిన్ కోజ్ బ్రౌన్ అనే ఎలక్ట్రికల్ ఇంజనీర్ చేసిన పరిశోధన ప్రకారం ఈ క్రింది విధంగా జరిగే పోల్ షిఫ్ట్‌కే అవకాశం ఎక్కువగా ఉంది అని స్వర్ణయుగము మాసపత్రికలో విశ్లేషణ చేయడం జరిగింది.






హ్యూగ్ బ్రౌన్ ప్రకారం భూమి యొక్క ఉత్తర ధృవం ఫిలిప్పీన్స్ ప్రాంతానికి మారుతుంది.

జపాన్‌కి, ఇండోనేషియాకి మధ్యలో ఈ ఫిలిప్పీన్స్ దేశం ఉంటుంది.

2004 లో ఇండోనేషియా ప్రాంతంలో అతి భయంకరమైన సునామీ రావడం, ఆ తదుపరి అనేక భారీ భూకంపాలు ఈ ప్రాంతంలో ఏర్పడడంతో ఈ ప్రాంతానికే పోల్ షిఫ్ట్ జరిగే అవకాశం ఉంది అని అభిప్రాయపడటం జరిగింది.

- ఈ పోల్ షిఫ్ట్ అంశాన్ని నిన్న మొన్నటి వరకూ ఆధునిక శాస్త్రవేత్తలు ఎవరూ సమర్థించేవారు కాదు. అదంతా ట్రాష్ అని కొట్టేసేవారు.
- ఇంకా కొన్ని లక్షల సంవత్సరాలకు కానీ ఈ పోల్ షిఫ్ట్ జరగదు అని వాదించేవారు.
- కానీ ఇప్పుడు సడన్‌గా ఆధునిక శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాన్ని మార్చుకోవాల్సి వచ్చింది.
- రానున్న రెండు మూడు వందల సంవత్సరాలలోనే ఈ పోల్ షిఫ్ట్ జరుగబోతోంది అని వారు పేర్కొంటున్నారు.

ఈ వివరాలను 24.7.14 న సాక్షి దినపత్రికలో "ఉత్తరం దక్షిణం ఉల్టా పల్టా" అనే శీర్షికతో వెలువడిన వ్యాసం నుండి తెలుసుకుందాం.

**(ప్రారంభం .........)**

భూమి ఒక పెద్ద బంతిలాంటి అయస్కాంతం. దాని చుట్టూ రక్షణా కవచంలాగ వేల మైళ్ల కొద్దీ అయస్కాంత క్షేత్రం ఉంది. కానీ ఇప్పుడా క్షేత్రం బలహీనమవుతోంది. తలక్రిందులుగా తిరగబడేందుకు సిద్ధమవుతోంది!

మరి ఉత్తర, దక్షిణాలు ఉల్టా పల్టా అయితే ... ఏమవుతుంది?

మన సౌర కుటుంబంలో ఒక్క భూమిపై మాత్రమే జీవుల మనుగడకు తోడ్పడే వాతావరణం ఎందుకు ఉందో తెలుసా?

భూమి అంతర్భాగం నుంచి చుట్టూ వేల మైళ్ల వరకూ బలమైన అయస్కాంత క్షేత్రం ఆవరించి ఉండటం వల్లే.

ఆ అయస్కాంత క్షేత్రమే లేకపోతే అసలు భూమిపై ఓజోన్ పొర, ఇప్పుడున్న వాతావరణమే ఉండేవి కావు. సూర్యుడి నుంచి దూసుకొచ్చే సౌరగాలులు, ప్లాస్మా కణాలు, అంతరిక్షం నుంచి వచ్చే కాస్మిక్ రేడియేషన్ ఓజోన్ పొరను తూట్లు పొడిచేవి. వాతావరణాన్ని దాదాపుగా ఊడ్చుకు పోయేవి!

ఫలితంగా అతినీలలోహిత కిరణాలు, రేడియేషన్ తాకిడికి భూమి కూడా ఇతర గ్రహాల్లా వట్టి మట్టిముద్దగా మిగిలిపోయేది.

※ అయితే భూమికి ఇంత ముఖ్య రక్షణ కవచమైన అయస్కాంత క్షేత్రం గత ఆరు నెలలుగా ఒక ప్రక్క బలహీనం అవుతోంది.
అదే సమయంలో ఇంకొక ప్రక్క బలోపేతం అవుతోంది.

భూ అయస్కాంత క్షేత్రానికి అసలు ఏం జరుగుతోంది?
అది బలహీనం అయితే ముప్పు ఏర్పడుతుందా?
మున్ముందు ఏం జరగబోతోంది?
శాస్త్రవేత్తలు చెబుతున్న ఆసక్తికర సంగతులు ఇవీ..

## పుడమికి అసలైన రక్షణ కవచం

అంతరిక్షంలో సెకనుకు 200 నుంచి 1000 కి.మీ. వేగంతో దూసుకొచ్చే సౌరగాలులు, విద్యుదావేశ ప్లాస్మా కణాల ధాటికి సాధారణంగా అయితే భూమి వాతావరణం తుడిచిపెట్టుకుపోవాలి. కానీ వాటిని అడ్డుకుని దారి మళ్లించడం ద్వారా భూగోళాన్ని అయస్కాంత క్షేత్రం నిరంతరం రక్షిస్తోంది.



భూమి చుట్టూ అదృశ్యరూపంలో గాలి బుడగలా ఉన్న ఈ అయస్కాంత క్షేత్రం సూర్యుడి వైపుగా సుమారు 63 వేల కి.మీ.లు, వెనుక వైపుగా 12 లక్షల కి.మీ. వరకూ భూమిని ఆవరించి ఉంటుంది. అయితే సౌరగాలుల ఒత్తిడిని బట్టి ఇది ఒకొక్క చోట ఎక్కువ, ఒకొక్క చోట తక్కువ సైజులోకి మారుతుంటుంది.

## గుట్టువిప్పిన ఉపగ్రహాలు

భూమికి భౌగోళికంగా ఉత్తర, దక్షిణ ధ్రువాలు ఉన్నట్టే,
అయస్కాంత క్షేత్రానికి కూడా ఉత్తర, దక్షిణ ధ్రువాలు ఉంటాయి.

ప్రస్తుతం అయస్కాంత ధ్రువాలు భౌగోళిక ధ్రువాలకు దగ్గరగానే ఉన్నాయి.

※ అయితే పశ్చిమార్ధ గోళంపై అయస్కాంత క్షేత్రం గత ఆరు నెలలుగా క్రమంగా బలహీనం అవుతోంది అని,

-- అదే సమయంలో దక్షిణ హిందూ మహా సముద్రం వైపు బలోపేతం అవుతోంది అని ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ) కు చెందిన మూడు 'స్వార్మ్' ఉపగ్రహాల పరిశీలనలో తేలింది.

స్వార్మ్ ఉపగ్రహాల సమాచారాన్ని నిశితంగా అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు ఇది 2, 3 లక్షల ఏళ్లకు ఒకసారి జరిగే సహజ ప్రక్రియలో భాగంగానే జరుగుతోంది అని గుర్తించారు.

※ ఇప్పుడు మరొకసారి భూమి అయస్కాంత క్షేత్రం తారుమారు అయ్యే సమయం వచ్చేసింది అని,

-- 2, 3 వందల ఏళ్లలో దాని ఉత్తర ధ్రువం దక్షిణానికి,
దక్షిణ ధ్రువం ఉత్తరానికి మారిపోనున్నాయి అని,

-- ఇప్పుడు కనిపిస్తున్నది ఆ ప్రక్రియకు ముందస్తు సంకేతమేనని వారు తేల్చారు.

## ఎందుకీ తకరారు?

అయస్కాంత క్షేత్రం తలక్రిందులు ఎందుకు అవుతుందో తెలుసుకోవాలి అంటే, ముందుగా అది ఎలా ఏర్పడుతుందో తెలుసుకోవాలి.

సింపుల్‌గా చెప్పాలి అంటే, కడుపులో భారీ ఇనుప బంతి, దాని చుట్టూ ద్రవరూపంలో ఉన్న ఇనుము, నికెల్ లోహాల మిశ్రమం తిరగడం వల్ల భూమి అనేది ఒక ఎలక్ట్రిక్ డైనమో (విద్యుచ్ఛాలక యంత్రం) లాగ పనిచేస్తుంది.

దానితో భూమి చుట్టూ భారీ అయస్కాంత క్షేత్రం ఏర్పడుతుంది.

ఇప్పుడు కొంచెం వివరంగా చూద్దాం.

భూకేంద్రమైన ఇన్నర్ కోర్ భాగంలో ఘనరూపంలోని ఇనుము 10,300 ఫారిన్‌హీట్ డిగ్రీల వరకూ ఉంటుందట. దాని చుట్టూ ఇనుము, నికెల్, ఇతర లోహాలు ద్రవరూపంలో ఉండే ఔటర్ కోర్ పొర ఉంటుంది.

ఈ రెండు పొరల మధ్య ఉష్ణోగ్రతలు, పీడనం, సంఘటనం మొదలైనవి ఆధారంగా ఉష్ణ ప్రసరణం జరుగుతుంది.

అదే విధంగా ఈ లోహాల ప్రవాహం ఎలక్ట్రిక్ కరెంట్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా అవి అయస్కాంత క్షేత్రాలుగా మారతాయి.

ఈ లోపలి చిన్న చిన్న అయస్కాంత క్షేత్రాలన్నీ కలిసి భూమి చుట్టూ ఒక పెద్ద అయస్కాంత క్షేత్రాన్ని ఏర్పరుస్తాయి. అయితే కోర్ ఉష్ణోగ్రతల్లో మార్పులు, భూ భ్రమణాన్ని బట్టి ద్రవలోహాలు తిరుగుతాయి.

ఈ ద్రవ లోహాల ప్రవాహం, వేడి తగ్గిన చోట అయస్కాంత క్షేత్రం ఉపరితలంలో బలహీనం అవుతుంది.

ఉదాహరణకు అమెరికాపై అయస్కాంత క్షేత్రం బలహీనం అవడం అంటే, అమెరికా క్రింద ఔటర్ కోర్‌లో ప్రవాహం మందగించింది అని అర్థం చేసుకోవచ్చు.



## వేల ఏళ్ల నుంచి వందల ఏళ్లకు

భౌగోళిక ధ్రువాల మాదిరిగా అయస్కాంత ధ్రువాలు స్థిరంగా ఉండవు. నిరంతరం కదులుతూ ఉంటాయి.

- ప్రస్తుతం ఉత్తర అయస్కాంత ధ్రువం సైబీరియా (రష్యా) వైపుగా సంవత్సరానికి 25 మైళ్ల చొప్పున కదులుతోందట.

అయితే అయస్కాంత ధ్రువాలు 2, 3 లక్షల ఏళ్లకు ఒకసారి తిరగబడతాయని, ఆ తిరగబడే ప్రక్రియ 2 వేల ఏళ్ల పాటు జరుగుతుందని ఇంతవరకూ భావించేవారు. అయస్కాంత క్షేత్రం బలహీనం అయ్యే ప్రక్రియ వందేళ్లకు ఐదు శాతం జరుగుతుందనీ అనుకునేవారు.

- కానీ స్వార్మ్ ఉపగ్రహాల సమాచారంపై అధ్యయనం తర్వాత దశాబ్దానికే ఐదు శాతం ప్రక్రియ జరుగుతోందని అంచనా వేశారు.
- దీనితో రెండు, మూడు వందల ఏళ్లలోనే అయస్కాంత ధ్రువాలు మారతాయని భావిస్తున్నారు.

## అరుదైనదే కానీ, హానికరం కాదు

భూమి అయస్కాంత క్షేత్రం ఒక ప్రక్క బలహీనం అయినా, వాతావరణాన్ని సౌరగాలులు, రేడియేషన్ తూట్లు పొడిచేంతగా క్షీణించిపోదట.

అయస్కాంత క్షేత్రం బలహీనమైనా, లేదా తారుమారు అయినా, కాస్మిక్ రేడియేషన్‌ను అది అడ్డుకోవడాన్ని ఆపదని, అందువల్ల భూగోళానికి ఏ హానీ ఉండదని, అన్నీ సక్రమంగానే జరుగుతాయి అని శాస్త్రవేత్తలు అంటున్నారు.

భూమి చుట్టూ అయస్కాంత క్షేత్రం పూర్తిగా మాయమవ్వదని, కాస్త బలహీనం మాత్రమే అవుతుందని వారు భరోసా ఇస్తున్నారు.

(....... ముగింపు)

వాస్తవానికి ఉత్తర ధృవం తూర్పు వైపుకు వేగంగా కదులుతూ ఉన్న విషయాన్ని శాస్త్రవేత్తలు క్రిందటి సంవత్సరమే గుర్తించారు.

అమెరికా, జర్మనీ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు "గ్రావిటీ రికవరీ అండ్ క్లయిమేట్ ఎక్స్‌పెరిమెంట్ మిషన్ (గ్రేస్)" అనే పేరుతో ఉపగ్రహాల ద్వారా చేసిన పరిశోధనలలో 2005 తరవాత ఉత్తర ధృవం వేగంగా కదులుతోన్న విషయాన్ని గుర్తించారు.

✳ 1982 - 2005 మధ్య కాలంలో 2 మిల్లీఆర్క్‌సెకండ్స్ (ఎమ్ఏఎస్) చొప్పున కదిలిన ఉత్తర ధృవం,

-- 2005 తరువాత 9 మిల్లీఆర్క్‌సెకండ్స్ చొప్పున కదలడం మొదలుపెట్టింది.

ఠ అంటే ఒక విధంగా 2004 డిశంబరులో వచ్చిన సునామీ తరువాత ఈ వేగం పెరిగింది అని మనం భావించవచ్చు.

2005 తరువాత ఉత్తర ధృవం మీద ఉన్న మంచు వేగంగా కరిగిపోతోంది అని, సముద్రపు మట్టం పెరుగుతోంది అని, అదే ఈ ఉత్తర ధృవం వేగంగా కదలటానికి కారణం అని శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఇప్పుడు ఈ పోల్ షిఫ్ట్ గురించి చర్చించడం ఎందుకు అంటే,**

భూమికి సంబంధించినంత వరకు ఇది చాలా అరుదైన సంఘటన, కొన్ని లక్షల ఏళ్ళకు ఒకసారి జరిగే సంఘటన అని శాస్త్రవేత్తలే చెబుతున్నారు.

---

1 - 16.5.13 నాటి హిందూ దినపత్రిక నుండి



✳ భూమి మీద ఏర్పడబోయే ఇటువంటి అనూహ్య పరిణామాల గురించి మాస్టరుగారు అనేక విషయాలను తెలియజేశారు.

ఠ అంతిమంగా ఈ పరిణామలు అన్నీ మానవజాతిని ఒక స్వర్ణయుగము లోనికి తీసుకువెళ్ళినప్పటికీ,

-- ప్రస్తుతపు మానవ సమాజం తన స్వార్థపూరిత పోకడలను విడనాడకపోతే చాలా భయంకరమైన పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

రేపు ఏర్పడబోయే భయంకర పరిణామాలను పట్టించుకోకుండా చాలా గుడ్డిగా మానవ సమాజం నరకం వైపుగా ప్రయాణం చేస్తోంది.

ఒక వైపు గురువులు భూమిని స్వర్గంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు.
ఇంకొక వైపు మనుష్యులు భూమిని నరకంగా మారుస్తున్నారు.

ఇదీ ఈనాటి పరిస్థితి.

ఇటువంటి పరిస్థితులలో మాస్టరుగారి యొక్క జ్ఞాన సంపద ఆధారంగా, భవిష్యవాణులు ఆధారంగా మనుష్యులలో మనం విజ్ఞతను మేల్కొల్ప గలిగితే, బుద్ధిని ప్రచోదన చేయగలిగితే, వివేకాన్ని జాగృతం చేయగలిగితే,

మానవ సమాజం తప్పకుండా సత్యయుగం వైపు ప్రయాణం చేస్తుంది.

ఠ మాస్టరుగారు తాను అనామకుడిగా జీవించడానికి ఇష్టపడ్డారు తప్ప, తన అనుయాయులు రాజాధిరాజులు కావాలి అనే కోరుకున్నారు.

అందుచేత విపరీత దిశలో సాగుతోన్న మానవ సమాజం యొక్క ప్రయాణాన్ని మంచి వైపు మరల్చే బాధ్యతను మనం స్వీకరించగలిగితే,

అదే మనం మాస్టరుగారికి అర్పించగలిగే నిజమైన శ్రద్ధాంజలి.

✳✳✳